# మట్టి వాసన

వెంకటసుబ్బయ్య జీవిత చరిత్రలో అది మామూలు రోజు కాదు. ఎన్నో యేళ్ళుగా ఎదురుచూస్తున్న రోజది. ముప్పయి సంవత్సరాల తరవాత ఉద్యోగం నుంచి విరమిస్తున్న రోజది.

నిన్నటిదాకా ఆయనంటే మండిపడిన అధికారులు, అవహేళన చేసిన సాటి ఉద్యోగులు, భయపడిన కింది ఉద్యోగస్థులు, గజగజలాడిన ప్యూనులు – అందరూ ఆ రోజు సాయంకాలం తమ పాత భావాలను మరిచిపోయి ఒకచోట సమావేశమైనారు వెంకటసుబ్బయ్యను ఘనంగా సన్మానించడానికి.

తేనీటి విందుతో సభ ప్రారంభమయింది. సన్మానపత్రం సమర్పించబడింది. ఆ తరువాత పెద్దలు ముగ్గురు, నలుగురు వెంకటసుబ్బయ్య గుణగణాలను కొనియాడుతూ ఉపన్యసించారు. చాలా మంచివాడని యోగ్యతా పత్రం ఇచ్చారు.

వాళ్ళ మాటలు వింటున్నంతసేపూ ఆయనకు ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకినట్టనిపించింది. మాటల్లోనే కాదు చేతల్లో కూడా తమ మంచితనాన్ని స్పష్టం చేసుకున్నారు వాళ్ళు ఈ మంచితనమంతా ఇంతకాలం ఎక్కడ తల దాచుకున్నట్టు? ఇదే వెంకటసుబ్బయ్యను వేధించుకుతిన్న ప్రశ్న. ఉద్యోగంచేస్తున్న రోజుల్లో తనకు జరిగిన అన్యాయాలనూ, అవమానాలనూ ఎలుకమీదా, పిల్లిమీదా పెట్టి చెప్పాలనుకున్నాడు వాళ్ళంటే తనలో గూడుకట్టుకున్న అసహ్యాన్నీ, కోపాన్నీ ఆ విధంగా బయటపెట్టాలనుకున్నాడు. కానీ ఆ విందూ, ఆ సన్మానపత్రం, మిత్రులు బహూకరించిన వస్తువులూ, వారి ప్రశంసా వాక్యాలూ ఆయన మనస్సుని పూర్తిగా మార్చివేశాయి. ఏదో చెప్పాలనుకున్న వాడు కాస్తా చివరికి రెండే రెండుమాటల్లో తన కృతజ్ఞతను తెలియజేసికూర్చున్నాడు.'' మీ మంచితనం

నాకు తెలియంది కాదు. మీతో కలిసిమెలిసి పనిచేసే భాగ్యం కలిగినందుకు నేనెంతో సంతోషిస్తున్నాను, గర్విస్తున్నాను.''

వెంకటసుబ్బయ్య అన్న ఆ రెండు మాటలకే కొందరు ఆహాహా అంటే, మరి కొందరు లోలోన హాహాకారాలు చేశారు. మంచితనం అన్న మాటలో ఏదో వ్యంగ్యం వున్నదని హాహాకారాలు చేసిన పెద్దల అభిప్రాయం.

ఎంత ప్రయత్నించినా, ఆ రాత్రి ఆయనకు కునుకు పట్టలేదు. గడిచిపోయిన ముప్పయి సంవత్సరాలూ ఆయన మనోనేత్రం ముందు ఒక్కసారి రెక్కలు గట్టుకువాలాయి. ఎన్నో సంఘటనలు! ఎన్నెన్నో విషయాలు! వాటితోపాటు ''ఉద్యోగం చెయ్యండి, ఉద్యోగం పురుష లక్షణం'' అంటూ హితబోధ చేసిన తన సహధర్మచారిణీ, ఆమె దుర్మరణమూ గుర్తుకి వచ్చాయి. అంతే, మిగిలిన విషయాలన్నీ తెర మరుగులోకి వెళ్ళాయి.

పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు వెంకటసుబ్బయ్య. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. కాళ్ళూ చేతులూ మొద్దుబారాయి. గుండె బరువెక్కింది. కూర్చున్నవాడు అలాగే శిలలా కూర్చుండిపోయాడు.

కాలం జరజరా ముందుకు సాగిపోతోంది.

స్ఫురణకు వచ్చిన పాత విషయాలు సనసన్నగా తొలగిపోవడంతో అయన మనస్సు కొంచెం తేలిక పడింది. కాని ఒక్క సంఘటన... మరిచిపోదామన్నా మరిచిపోలేక బాధపడసాగాడు. అది మనస్సుని రంపపుకోత పెట్టసాగింది.

వెంకటసుబ్బయ్య భార్య కాపురానికి వచ్చిన తొలి రోజులవి.

ఒకసారి ఆమెకు టైఫాయిడ్ వచ్చింది. ఇంట్లో సహాయానికి ఎవరూ లేరు. పక్క వాటాలో నివసిస్తున్న వాళ్ళు, పెళ్ళికని ఏదో ఊరికి వెళ్ళారు. అత్తగారిని పంపించవలసిందిగా మామగారికి ఉత్తరం వ్రాశాడు వెంకటసుబ్బయ్య. కాని ఆమె రావడానికి వీలుపడలేదు. ఇక వచ్చే వాళ్ళెవ్వరూలేరు. ఎలాగో వెంకటసుబ్బయ్యే తంటాలు పడసాగాడు. భార్యకు కావలసిన వాటన్నిటినీ మంచం దగ్గర ఒక బల్ల మీద అమర్చి, ఆ తర్వాత

ఆఫీసుకు వెళ్ళి సాయంకాలం మళ్ళీ యింటికి వచ్చేవాడు. మధ్యాహ్నం పూట ఎవ్వరూ దగ్గర లేకపోవడంతో, ఆమెకు పిచ్చెక్కినట్టుండేది. ఒకవైపు జ్వర తీవ్రత, మరోవైపు ఎవ్వరూ దగ్గర లేరనే బాధ. చేసుకునే ఓపిక లేకపోయినా తప్పదు కాబట్టి ఎలాగో తన పనులు తానే చేసుకుంటూ వుండేది. కొన్ని పనులు భర్తతో చెప్పడానికి సిగ్గుపడేది. ఆమె మనస్సుని పసిగట్టి వెంకటసుబ్బయ్య ఇంటివద్ద బయలుదేరడమే ఆలస్యంగా బయలు దేరాడు. ''ఇవాళ సెలవు పెట్టండి'' అంది భార్య. తానూ అలాగే చేద్దామనుకున్నాడు. కాని ఆఫీసులో ముఖ్యమైన పని ఒకటి వుంది. ఆ పని తనవల్ల యెందుకు ఆలస్యం కావాలి అనుకున్నాడు. ఎన్నడూ ఆఫీసుకి ఆలస్యంగా వెళ్ళని వెంకటసుబ్బయ్య.

అప్పటికే రెండుసార్లు అడిగాడు ఆఫీసరు ''ఇంకా వెంకటసుబ్బయ్యరాలేదూ'' అని. ''అబ్బబ్బే... వీళ్ళకు ఆఫీసంటే భయమూ భక్తీ లేదు. అర్జంటు కాగితాలున్నా, అలాగే టేబిలుమీద పురగేసి పెడతారుగాని వాటిని డిస్పోస్ చేద్దామని అనుకోరుగదా. వర్థీ....'' అని స్వగతం చెప్పుకుంటున్న సమయంలో వెంకటసుబ్బయ్య ఆఫీసరుగారి గదిలో అడుగు పెట్టాడు. ''నమస్కారం...'' అంటూ సవినయంగా ప్రారంభించి ఏదో చెప్పబోయాడు. కాని ఆఫీసరుగారు తనను చూసీ చూడడంతోనే మండిపడడం మొదలుపెట్టేసరికి, తల వంచుకుని నిలబడ్డాడు వెంకటసుబ్బయ్య. ఏమీ మాట్లాడలేదు. తన భార్య సలహాను కనుక పాటించి వుంటే, ఈ రభస ఉండేది కాదనుకున్నాడు. ఏమయితేనేం ఈ సంఘటనను చాలా రోజులదాకా మరిచిపోలేకపోయాడు.

ఆ రోజు సాయంకాలం పని ముగించుకుని ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి ఏడయింది.

గుమ్మంలో వెంకటసుబ్బయ్య అడుగు పెట్టాడో, లేదో, పక్కింటి పిన్నిగారు ''ఏం నాయనా యివ్వాళ సెలవు పెట్టలేక పోయావా? పాపం మందిచ్చేవాళ్ళయినా లేక అమ్మాయి ఎంత యాతన పడిందనుకున్నావు! 104 డిగ్రీల జ్వరం...'' అన్నది.

తన్నుతాను తిట్టుకున్నాడు వెంకటసుబ్బయ్య. అనారోగ్యంగా ఉన్న భార్యను ఒంటరిగా వదిలిపెట్టి తాను ఆఫీసుకి వెళ్ళి సాధించిందేమిటి? అబద్ధాలు చెప్పి, సెలవు పెట్టి తాను ఇంట్లో కూర్చో లేదు. సెలవు పెట్టవలసిన కారణం వున్నా సెలవు పెట్టకుండా ఆఫీసుకి వెళ్ళి తన విద్యుక్తధర్మం తాను నెరవేర్చాడు. అందుకు పొందిన ప్రతిఫలం? ఆఫీసరు గారి చీవాట్లు; సాటి ఉద్యోగస్థుల అవహేళన....

చాలా రోజుల తర్వాత ఈ విషయాన్ని తెలుసుకున్న వెంటసుబ్బయ్య భార్య నవ్వుతూ, "ఎంత ఆఫీసరయితే మాత్రం... ఆయన పాపాన ఆయనే పోతాడులెండి" అన్నది.

ఆరాత్రి అలా ఎంతసేపు కూర్చున్నాడో ఆయనకే తెలియదు. ఉన్నట్టుండి ఒక్కసారిగా చిరపరిచితమైన పాలవాడి గొంతు వినిపించింది. ఆ తర్వాత కొంత సేపటికి పక్షుల కలకలా రావంతో దశ దిశలూ కళ్ళు తెరిచాయి. ప్రకృతికాంత ప్రభాతగీతం పాడుతోంది.

వెంకటసుబ్బయ్యది మధ్యతరగతికి చెందిన కుటుంబం, పేరు ప్రతిష్టలు గల కుటుంబం. సిరిసంపదలు అంతగా లేక పోయినా అన్నవస్త్రాలకు కొదువలేని కుటుంబం. వేళకాని వేళల్లో వచ్చినవారికి కూడా ఆతిధ్యం యివ్వడం, శుభకార్యాలు చేసుకుంటామంటూ వచ్చేవారికి సహర్షంగా తృణమో పణమో ముట్టచెప్పడం, ఇతరులకు చేదోడు వాదోడుగా వుండడం ఆ కుటుంబంలో అనుశ్రుతంగా వస్తున్న కొన్ని మంచి లక్షణాలు. వెంకటసుబ్బయ్యలో యివి అంత స్పష్టంగా కనిపించక పోయినా "మంచివాడు, అనవసరంగా ఒకరి జోలికి పోడు." అనే మంచి పేరు మాత్రం సంపాదించాడు. బి.ఏ.దాకా తాను చదువుకున్నందువల్లనూ, మెట్రిక్ ప్యాసయిన తన భార్య పోరుపెట్టడం వల్లనూ ఆయన ఉద్యోగం చెయ్యక తప్పింది కాదు.

వెంకటసుబ్బయ్యకు ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేదు. పెద్దలిచ్చిపోయిన ఆరెకరాల మాగాణీ సుక్షేత్రాన్ని నమ్ముకుని స్వగ్రామంలో
12 జీవితయాత్ర సాగించాలనుకున్నాడు. ప్రాచీన భారతీయ సంస్కృతికే కాక

ఆధునిక విజ్ఞానానికి కూడా పల్లెటూరు పట్టుగొమ్మ కావాలని ఆశించాడు. ఇందుకు తాను చదివిన చదువూ, గడించిన విజ్ఞానమూ అంకితం కావాలని అభిలషించాడు. మరికొన్ని అభిలాషలనుండి, ఆశయాలనుండి ఆయనలో కొన్ని చోటు చేసుకున్నాయి. కాని మొదట్లోనే రెండు వందల రూపాయల ఉద్యోగం వచ్చేసరికి ఆ ఆశయాలూ, అభిలాషలూ అదృశ్యం కాక తప్పలేదు. అయినా ఉద్యోగం, చేస్తున్నంత కాలమూ ఎప్పుడెప్పుడు ఈ పీడ విరగడ అవుతుందా, ఎప్పుడెప్పుడు స్వగ్రామం చేరుకుంటానా? అనుకునేవాడు వెంకటసుబ్బయ్య. ఏవో కొన్ని కారణాలవల్ల విసుగుపుట్టి, రెండు మూడుసార్లు కష్టపడి రాజీనామా ఉత్తరం కూడా తయారుచేశాడు. కాని పై అధికారి వద్దకు మాత్రం అది పోలేదు. ఇందుకు కారణం ఆయన భార్యే. ఎలాగయితేనేం చివరికి సవ్యంగానే ఆ కూపంలోంచి బయటపడగలిగాడు. కాని నా చిరకాల వాంఛ తీరదేమో– అని దిగులు పడసాగాడు.

వెంకటసుబ్బయ్యకు ఇద్దరు కుమారులు. ఇద్దరూ ప్రయోజకులైనారు. ఉద్యోగం చేసుకుంటున్నారు. పట్టణంలో పుట్టిపెరగడంవల్ల వాళ్ళకు పల్లెటూరన్నా పల్లెటూరివారన్నా తగని అసహ్యం. ఈ మనస్తత్వాన్ని చూసి ఆయన చాలా బాధపడ్డాడు. పల్లెటూరి ప్రస్తావన వచ్చినప్పుడల్లా "ఎందుకా బురద కొంపలో పొలమూ, ఇల్లూను. హాయిగా వాటినమ్మేసి ఈ పట్టణంలో తమలపాకులబడ్డీ పెట్టుకున్నా బాగుంటుంది. బోలెడు లాభం వస్తుంది." అనేవాళ్ళు. ఈ మాటలు విని మరీ బాధపడేవాడు వెంకటసుబ్బయ్య. బంగారం లాంటి భూమిని అమ్మివేసి తమలపాకు బడ్డీ పెట్టుకోడమా? ఇంత కంటె నీచమైన ఊహ మరొకటుందా? తమ పెద్దలెవరైనా ఇలాచేశారా? అనుకునే వాడు. కంట తడిపెట్టేవాడు. తండ్రీ కొడుకుల మనస్తత్వాలలో అంత భేదం!

వెంకటసుబ్బయ్యకు సొంత వ్యవసాయం చెయ్యాలనే ఒక్క కోరిక తప్ప మరొకటిలేదు. అయితే అది నెరవేరదనే దిగులు పట్టుకుంది. ఏమైనాసరే స్వగ్రామంలో జీవితశేషాన్ని గడపాలనే దృఢవాంఛ పుట్టన్న మయింది

తానొక్కడూ ఆ పల్లెటూరిలో కాలం గడపాలి. కన్న కొడుకులేమో ఆ ఊరి మొగం చూడడానికి కూడా యిష్టపడడం లేదు. వాళ్ళ దృష్టిలో పల్లెటూరు నివాసయోగ్యమయిందికాదు. భార్యయేమో గతించి చాలా రోజులయింది. మరి అటువంటప్పుడు తనకా గ్రామంలో యెవరుతోడు? ఎవరు దిక్కు? భోజనం వగైరాలు... అంతా అయోమయంగా కనిపించింది. కానీ చిరకాల వాంఛ మాటిమాటికి మనస్సులో మసులుతూ మనస్సుని చీకాకుపరిచింది. ఆ రాత్రంతా మానసికంగా బాధపడ్డాడు వెంకటసుబ్బయ్య. భార్య మరణం గుర్తుకి వచ్చినప్పుడల్లా ఆయన మనస్సు మరీ వికలమయ్యేది.

ఆ మరునాడు వెంకటసుబ్బయ్య తన చిరకాల వాంఛను సందేహిస్తూనే కొడుకులకు తెలియజేశాడు. అంతే, తండ్రి మీదికి కస్సుమంటూ లేచారు ఒక్క సారిగా. వెంకటసుబ్బయ్య మౌనం వహించాడు.

''సొంత వ్యవసాయం మనవల్ల వీలవుతుందా యేవి.టి? ఊరికే అనుకోవడమే గాని. ఇంతాచేస్తే మన కున్నది ఆరెకరాల భూమి. మాటవరసకి సొంత వ్యవసాయం పెడదామనే అనుకుందాం. ఇప్పుడు మనకు కౌలు రూపంగా వస్తున్న దానికన్నా ఆదాయం కొంచెం ఎక్కువే వస్తుందనుకుందాం. అయితే పొలం పనులకిందా, శిస్తుల కిందా పోను నిజానికి ఎంత మిగులుతుందిని? చివరికి మిగిలేది వెట్టిచాకిరి, హాయిగా ఆ కాస్తపొలమూ అమ్మేసి, ఆ వచ్చేదాంతో పట్టణంలో చిన్న వ్యాపారం పెట్టుకకోడం మంచిది. పోనీ ఆ డబ్బుని బ్యాంకులో వేసినా వడ్డీ డబ్బులు కూడా వస్తూవుంటాయి...''

ఇలా వాళ్ళిద్దరూ కూడబలుక్కున్నట్టు ఒకే మోస్తరుగా బదులు చెప్పారు.

వెంకటసుబ్బయ్య మనస్సు చివుక్కుమన్నది.

మానవుడు పుట్టింది కేవలం డబ్బు గడించడం కోసమేనా? ధనార్జన తప్ప మరో లక్ష్యం లేదా? భూలక్ష్మిని అమ్ముకోవటమా? అందులోనూ తన తాత ముత్తాతలు కండలు కరిగించుకుని, కడుపులు మాడ్చుకుని సంపాదించి యిచ్చి పోయిన సుక్షేత్రాన్ని అమ్ముకోవడమా? ఇందుకా

పెద్దలు పొలం యిచ్చి వెళ్ళింది. అమ్ముకునేటంత అవసరం ఇప్పుడేం వచ్చి పడిందని?

ఇలా అనుకుని బాధ పడ్డాడు. ఇంకా తానేమన్నా నోరు మెదిపితే వాదోపవాదాలు ఆరంభమవుతాయని అనుకున్నాడు. తన తదనంతరం తన అరెకరాల భూమి ఎవరికో సంక్రమిస్తుంది. భూలక్ష్మిని సేవించే భాగ్యం తన సంతతికి లేదు.

వెంకటసుబ్బయ్య కళ్ళనుంచి నేల రాలాయి అశ్రువులు.

కొన్నాళ్ళకు కొండంత ఆశతో వెంకటసుబ్బయ్య స్వగ్రామానికి బయలుదేరాడు.

రైలుదిగి నడక సాగించాడు. ఆయనకు ఎక్కడలేని ఉత్సాహం కలిగింది. స్టేషనుకీ, ఊరికీ మధ్య నాలుగుమైళ్ళు. తాను పట్టణంలో నడిచిన తారురోడ్డు కాదది. గతుకుల కాలిబాట. దానికి అటూ, ఇటూ పంటపొలాలు. పొలాల్లో పనిపాటలు చేసుకుంటూ రైతులు మధ్యమధ్య పదాలు పాడుతున్నారు. కండ చక్కెరవంటి ఆ కమ్మని పదాలలోని మాధుర్యం, గల గల మంటూ పరిగెత్తే జిలిబిలి పంటకాలవలూ, మనస్సుని మరిపించే ఆ పరిసరాల ప్రకృతి శోభా వెంకటసుబ్బయ్యను ముగ్ధుణ్ని చేశాయి. ఆవులు 'అంబా, అంబా' అంటూ అరుస్తుంటే ఆయన మనస్సు ఆనంద పారవశ్యం చెందింది. అంతకు మునుపు ఎన్నో సార్లు ఆయన స్వగ్రామానికి వెళ్ళాడు. పల్లెటూరి వాతావరణం ఆయనకు అపరిచితమయింది కాదు. అయినా ఆ రోజు ఎందుకో ప్రతి చిన్న విషయమూ వెంకటసుబ్బయ్యకు ప్రముఖంగా కనిపించింది. అంతులేని సంతోషం. ఉత్సాహం. తన చిరకాల వాంఛ-సొంత వ్యవసాయం చెయాయలనే కోరిక - చిగురించే శుభ సమయం దగ్గరపడుతోందను కున్నాడు. కనుచూపు మేరలో గుడిగోపురం కనిపించింది. అది వాళ్ళ ఊరి శివాలయం గోపురం. అదికనిపించిందో, లేదో ఆయన మనస్సులో అణిగి మణిగి వున్న భక్తి భావం ఒక్కసారిగా పైకుబికింది. రెండు చేతులూ జోడించి సభక్తికంగా అన్నాడు: ''ఇన్నాళ్ళకు నీ సన్నిధికి వచ్చే భాగ్యం కలిగింది.''

ఆ గుడిని కట్టించిన వారిలో తన పూర్వులు కూడా వున్నారు. తన తండ్రి కొంతకాలం గుడికి ధర్మకర్తగా వుండే వారు. ఆయన హయాంలో ప్రతి యేడూ మహావైభవంగా దేవుని కళ్యాణం జరిగేది. పొరుగూళ్ళ నుంచి కూడా ప్రజలు వచ్చేవారు, ఆ మహోత్సవాన్ని చూసి తరించాలనే పవిత్రా శయంతో కూచిపూడి భాగవతుల నాటకాలతో, తోలుబొమ్మల ఆటలతో, హరికథా కాలక్షేపాలతో ఆ అయిదు రోజులూ అయిదు నిమిషాలుగా గడిచిపోయ్యేవి. ఆ నాటకాలూ, ఆ భోజనాలూ అవన్నీ గుర్తుకు రావడంతో తన తండ్రి తాత ముత్తాతలూ, వాళ్ళ సాహసౌదార్యాలూ, సాధుశీలం, రుచిర ప్రవర్తనా స్ఫురణకు వచ్చాయి. కాలగర్భంలో కలిసిపోయిన ఆ విషయాలను ఒకొక్కక్కటిగా గుర్తుచేసుకుంటూ నడక సాగించాడు. కాని తాను ఏం చేసినట్టు తన గ్రామానికి? ఒక్క మంచిపనీ చెయ్యలేదు. మండువేసవిలో ఒక్క చలివేంద్రంకూడా పెట్టించలేదు. ఎందుకూ పనికిరానివాణ్ణి – అనుకున్నాడు వెంకటసుబ్బయ్య.

కొంతసేపటికల్లా తన ఊరి పొలిమేరలో అడుగుపెట్టాడు. ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది. విద్యుత్తులా కొత్త ఉత్సాహం ప్రవేశించింది. చిన్నప్పుడు చదువుకున్న ''జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ'' అన్న మధురోక్తి గుర్తుకు వచ్చింది. అది అక్షరాలా నిజమనుకున్నాడు. ఇక నడకసాగలేదు. అలాగే ఉన్నచోట నిలబడిపోయాడు. మధురస్మృతులు ఏవేవో తరంగాలవలె ఒకదానివెంట మరొకటి తరుముకుంటూ ముందుకు వచ్చాయి. ఆనందా శ్రువులు రాలాయి. ఆయనలోని ఒక్కొక్క అణువు ఆనందపారవశ్యం చెందింది. ఇన్నాళ్ళూ బానిసత్వంలో క్రుంగి కృశించి పోయిన అంతరాత్మ ఆ బానిసత్వ సంకెళ్ళను ఒక్క సారిగా తెంచుకుని స్వేచ్ఛా వాయువుల్ని పీల్చి ధన్యోస్మి అనుకుంది.

ఇది నా ఊరు. మట్టి పిసికి, ఆ మట్టిలోనే బంగారం పండించిన కష్టజీవులు నా తాతముత్తాతలు. ఉన్నదాంతో తృప్తిగా జీవించిన ఉదార చరిత్రులు. వాళ్ళు వేసిన గడ్డ ఇది. వాళ్ళు నడిచిన గడ్డ ఇది... ఈ గడ్డ మీద వాళ్ళ అడుగులు ఇంకా కనిపిస్తూనే ఉన్నాయి... చెరిగిపోలేదు...

చెరిగి పోలేదు. వీటిని చెరగనియ్యను. నా ఊరిది. ఇక్కడకి మళ్ళీ వచ్చాను అనుకున్నాడు. సంతోషంతో ఉప్పొంగిపోయాడు. అవును ఆ గ్రామ చరిత్ర లోని కొన్ని అధ్యాయాలు ఆయన పూర్వుల చరిత్రకు సంబంధించినవి. తన ఊరంటే తనకంత మమకారం ఎందుకో అప్పుడు అవగతమయింది వెంటసుబ్బయ్యకు!